ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



మహాపడిపూజలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో సోమవారం ఘనపురం కృష్ణారెడ్డి 18వ అయ్యప్పస్వామి మహాపడిపూజ సోమవారం నాగారంలోని ఎంవైఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగ నిర్వహించారు. మహాపడి పూజలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి, గురుస్వాములు మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోతే కఠిన చర్యలు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి



మేడ్చల్: మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాలలో నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని, పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసే బ్యానర్లు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలలో ఎక్కడా నాయకులకు విలువ ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించడం లేదని, అలాంటి వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ప్రజాపాలనపై కళాయాత్ర



శామీర్‌పేట్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు 2024లో భాగంగా మేడ్చల్ జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందాలు ప్రజాపాలన కళాయాత్ర సోమవారం మూడుచింతలపల్లి మండలంలో జరిగింది. మండల పరిధిలోని నాగిశెట్టిపల్లి, కేశవరం, కొల్తూర్ గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో అవగాహన కల్పించారు. సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని అందచేస్తున్న శ్రీకాంత్ యాదవ్

జవహర్‌నగర్: పేదప్రజల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌కి చెందిన సంపత్‌గౌడ్‌కి చికిత్స నిమిత్తం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.2,40,000 ఎల్‌వోసీని ఇప్పించారు. ఈ సందర్భంగా మల్లెపూల శ్రీకాంత్ సోమవారం జవహర్‌నగర్‌లో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, భాస్కర్, సాయికృష్ణ, హరీష్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మాలల మహా పాదయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్ సీహెచ్‌ఎల్‌ఆర్ గార్డెన్‌లో మాలల మహా పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 25న భద్రచలంలో ప్రారంభమై.. హైదరాబాద్ పేరేడ్ గ్రౌండ్‌లో 29న ముగుస్తుందన్నారు. ఈ నెల 26న జిల్లాలోకి పాదయాత్ర ప్రవేశిస్తుందని, అధిక సంఖ్యలో మాలల హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరశురాం, దాసు, నర్సింగ్‌రావు, వీరేశం, ఆంజనేయులు, రాఘు, మురళీమోహన్, మహేష్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మేయర్



బోడుప్పల్: వక్ఫ్‌బోర్డు విషయంలో కలెక్టర్ ఇచ్చిన నివేదికను రెవెన్యూశాఖ త్వరగా పరిష్కరించాలని సోమవారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిశారు. చెరువుల అభివృద్ధి విషయంలో ఎన్‌ఓసీ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడాలని కోరగా, వెంటనే మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్ రెడ్డి, నాయకులు పొద్దుటూరి వెంకటేశ్‌గుప్తా తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా జి.రఘు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న త్రిలేశ్వర్‌రావు సెలవులపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా జి.రఘును ప్రభుత్వం నియమించింది. గతంలో జవహర్‌నగర్, కొత్తగూడెం, బడంగ్‌పేట్, కొంపల్లి, పోచారం మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మొదటిరోజు సమగ్ర ఇంటింటి కులగణన సర్వేపై సమీక్ష నిర్వహించి, కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించారు.

వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి





సాక్షి,సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలకు పెన్షన్ పెంచి వెంటనే అమలు చేయాలని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటినా ఎందుకు అమలు చేయటం లేదో తెలుపాలన్నారు. ఎన్‌పీఆర్డీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వికలాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. పెన్షన్ పెంచేందుకు డబ్బులు లేవని చెప్తూనే మరోవైపు కమిషన్లు వచ్చే ప్రాజెక్టులకు రూ.లక్షల కోట్లు ఎలా కేటాయిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో పెన్షన్ పెంపు కోసం 44 లక్షల మంది ఆసరా లబ్ధిదారులు, కొత్త పెన్షన్ మంజూరు కోసం 24.85 లక్షల మంది అర్హులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగిస్తూ.. గత ప్రభుత్వం జీవో 34 ఇచ్చిందని, దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. వికలాంగుల సంక్షేమ శాఖను బలోపేతం చేయాలన్నారు. 33 జిల్లాలో వికలాంగుల శాఖలో ఉద్యోగులను నియమించాలని కోరారు. ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఉద్యోగ నియామకాల్లో శరీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పరిశ్రమలలో నిరుద్యోగ వికలాంగులకు ఉపాధి అవకాశలు కల్పించాలని, వికలాంగులకు ఉచిత బస్ ప్రయాణం సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా కేంద్రాల్లో నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ అమలు చేయడానికి అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలన్నారు. సదరం సర్టిఫికెట్స్ రిజెక్ట్ అయినా వారికి సర్టిఫికెట్స్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో విలాంగులకు జాబ్ కార్డులు ఇచ్చి 150 రోజులు పని కల్పించాలన్నారు. జిల్లా స్థాయిలో 3 నెలలకు ఒక్కసారి జరగాల్సిన కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమ్, డీఆర్‌ఓ హరిప్రియకు మేడ్చల్ జిల్లాలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా నాయకులు చంద్రమోహన్, మల్లేష్, బాలయ్య, శివ, గంగారెడ్డి, చంద్రయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ 33/11కేవీ సబ్‌స్టేషన్, శివరెడ్డిగూడ 11 కేవీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శివరెడ్డిగూడ, మారుతీనగర్, ఘనాపూర్ ఏరియా, వందన హోటల్ ఏరియా, జాతీయ రహదారి, మేధా అపార్ట్‌మెంట్స్, పోలీస్‌స్టేషన్, హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు, జాన్సన్ మిల్క్ డేరీ, ఎంఆర్‌ఓ, ఎంపీడీఓ కార్యాలయం, జననీ అపార్ట్‌మెంట్స్, మైసమ్మగుట్ట, బండారి అపార్ట్‌మెంట్, శ్రీనిధి నెస్ట్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బలరాం తెలిపారు.

మేడ్చల్‌రూరల్‌లో..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. 11 కేవీ సీఎంఆర్ ఫీడర్ పరిధిలో పనుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సీఎంఆర్ విద్యాసంస్థలు, హెచ్‌పీ పెట్రోల్ బంక్, గంగాకావేరి సీడ్స్, సుతారిగూడ ఎస్‌పీఎం వెనుక భాగం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మేడ్చల్‌లో..

నేడు మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ అధికారులు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. 11కేవీ ఎన్‌జీఓ కాలనీ, ఫీడర్ 33/11కేవీలో మరమ్మతుల కారణంగా మేడ్చల్ పట్టణ పరిధిలోని కిష్టాపూర్ రోడ్డు, కెఎల్లార్ ఫేస్ 1, 2, రాఘవేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేడు మేడ్చల్‌కు మంత్రుల రాక

మేడ్చల్‌రూరల్: నేడు మేడ్చల్‌కు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుదిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి విచ్చేస్తున్నట్లు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని మేడ్చల్ మార్కెట్ కమిటీ నూతన భవనం ప్రారంభోత్సవంతో పాటు.. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్సింహులు యాదవ్, మేడ్చల్ జిల్లా గంధ్రాలయాల సంస్థ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవంలో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

మేడ్చల్‌లో 93 శాతం సర్వే పూర్తి

మేడ్చల్: ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే మేడ్చల్ మున్సిపల్ పరిధిలో 93 శాతం మేర పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. సర్వేలో పాల్గొనకుండా మిగిలిపోయిన కుటుంబాల యజమానులు మున్సిపల్ కార్యాలయంను సందర్శించాలని, లేదా 9618987141 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జీపీ కార్మికులకు 4 నెలల జీతాలు చెల్లించాలి





సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో లక్ష్మాపూర్, కేశవపురం గ్రామ పంచాయతీలో 4 నెలలు, పొన్నాల, కేశవరం, నూతనకల్, లింగాపూర్, గ్రామ పంచాయతీలో 3 నెలలు జీతాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)రాష్ట్ర ఉపాధ్యాక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో బతుకుతున్న గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం మూడు, నాలుగు నెలలు జీతాలు పెండింగ్‌లో పెడితే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కార్మికులకు జీతాలు పెంచుతామని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడుస్తున్నప్పటికీ పట్టించుకోకపోవటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల పురపాలక సంఘాల్లో విలీనం చేసిన జీపీ కార్మికులకు కూడా జీతాలు ఇవ్వటం లేదన్నారు. వీరిని మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ హరిప్రియకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకుడు ఉన్నికృష్ణ, గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ నాయకురాలు రాములమ్మ, జీపీ కార్మికులు పాల్గొన్నారు .

ఎక్సైజ్ స్టేషన్‌లో నేడు వాహనాల వేలం

మేడ్చల్: మేడ్చల్ ప్రోహబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలను నేడు వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు. వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను ఉదయం 11గంటలకు వేలం వేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇతర వివరాల కోసం కార్యాలయంను సంప్రదించాలని కోరారు.

గురుకుల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్



ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ క్రీడా మైదానంలో గురుకుల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్న శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ఘట్‌కేసర్‌లో కూరగాయలు, పండ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



హాస్టల్ వంట గదిలో వివరాలు తెలుసుకుంటున్న విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: రెసిడెన్షియల్, సంక్షేమ హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ బాలురు, బాలికల హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని సరుకుల గది, వంటశాల, కూరగాయలు, సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, పండ్లు, ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల సంగీత వాయిద్యాలు, నృత్యాన్ని పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజిని, జిల్లా ఎస్సీ అధికారి వినోద్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్స్ గొల్లబోయిన రాములు, రేణుక, వేణుగోపాల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆచూకీ లభ్యం

పోచారం: యంనంపేట్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్ నుంచి అదృశ్యమైన బీటెక్ విద్యార్థిని సాజిత ఆచూకీ సోమవారం తెలిసింది. తల్లిదండ్రులకు చెప్పకుండా ఈ నెల 7వ తేదీన నల్గొండలోని తన స్నేహితురాలు బిందు ఇంటికి వెళ్లిన సాజిత ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. దీంతో ఆమె ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. కేసు గురించి తెలుసుకున్న సాజిత తిరిగిరావడంతో పోలీసులు దర్యాప్తు చర్యలను ఆపేశారు.

ప్రజావాణిలో కలెక్టర్‌కు 67 ఫిర్యాదులు



సాక్షి,సిటీబ్యూరో: వివిధ సమస్యలపై ప్రజలు అందించిన 67 ఫిర్యాదులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ స్వీకరించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, చెరువులు, కుంటల పరిరక్షణపై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు రాతపూర్వకంగా వినతులను సమర్పించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు ,పెన్షన్లు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాయం వంటి పథకాల కోసం ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి, పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలపై ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇందులో డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

మేడ్చల్: మేడ్చల్ పట్టణ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆమె సోమవారం జవాన్లుతో, డ్రైవర్లతో, డోర్ టూ డోర్ చెత్త సేకరించే వాహనదారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి-పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. వార్డులలో దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలన్నారు. నీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సరిపడు విధంగా నీటిని సరఫరా చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఏర్పడ్డా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఏఈ సుందర్‌నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస చివరి సోమవారం.. ప్రత్యేక పూజలు



ఎదులాబాద్ శివాలయంలో లక్ష బిల్వార్చనలో స్వామివారు



శివాలయం ఆవరణలో అన్నదానం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో కార్తీక మాసం నాలుగో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని లింగాలకుంట స్వయంభూ నాగలింగేశ్వర స్వామి ఆలయం, శివారెడ్డిగూడ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం, అంకుషాపూర్, అవుషాపూర్, ఎదులాబాద్ శివాలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన, పత్రి, విభూతి, తులసి, పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. తులసి కోటలు, ఆలయ ధ్వజస్తంభం ఎదుట కార్తీకమాసం దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో

ముందుకు సాగుతున్న సీఎం



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్

మేడ్చల్‌రూరల్: రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి ముందు సాగుతున్నారని అందులో భాగంగానే గ్రంథాలయా, మార్కెట్, ఆలయ, ఇతర కమిటీల పాలకవర్గాల నియామకం చేపట్టినట్లు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో నూతనంగా నిర్మించిన మేడ్చల్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లాగ్రంథాలయాల చైర్మన్‌లతో పాటు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబులతో పాటు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి విచ్చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో మేడ్చల్‌లో అవినీతి మంత్రి ఉండడంతో అభివృద్ధి జరగలేదని, భూ కబ్జాలు జరిగాయన్నారు. పదేళ్ల పాలనలో శంకుస్థాపనలకే పరిమితం అయ్యారని, ఏ ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని, మేడ్చల్‌లో డిగ్రీ కళాశాల ఇప్పటికి వరకు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పది నెలల పాలనలో నూతన మార్కెట్ కమిటీ భవనం నిర్మాణంతో పాటు నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో రోడ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనం ఏర్పాటు వంటి ఎన్నో పనులు చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని బీఆర్‌ఎస్, బీజేపీలు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. నేడు సమగ్ర సర్వే చేస్తే గగ్గోలు పెడుతున్న బీఆర్‌ఎస్ హయాంలో చేసిన సర్వే రిపోర్టులు ఏమయ్యాయో తెలపాలన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన చేస్తే కలిగే ఇబ్బందిపై అసెంబ్లీలో చర్చకు రావాలన్నారు. వక్ఫ్ బోర్డు స్థలాలు కబ్జా చేసిన మల్లారెడ్డి, దేవాదాయ భూములు కబ్జా చేసిన ఈటల రాజేందర్ పేద వాళ్లా? అని ప్రశ్నించారు. డిసెంబర్ నెలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతీ నియోజకవర్గంలో ఉత్సవాలు నిర్వహించి తాము చేసిన అభివృద్ధి, ఏడాది పాలనపై ప్రజలకు వివరిస్తామని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రమేష్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట స్వామి సేవలో జిల్లా కలెక్టర్



స్వామి సేవలో కలెక్టర్ హనుమంతరావు దంపతులు

కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామిసేవలో సోమవారం సాయంత్రం యాదాద్రి-భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కుంటుంబ సమేతంగా పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో కీసరగుట్టకు విచ్చేసినన ఆయనకు ఆలయ పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకపూజ అనంతరం అర్చకులు హనుమంతరావు దంపతులకు స్వామివారి ఆశీర్వచనంతోపాటు, మహాప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం చీర్యాల లక్ష్మీనరసింహస్వామిని కూడా కలెక్టర్ హనుమంతరావు దంపతులు దర్శించుకున్నారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కీసరగుట్టలో చందానగర్‌కు చెందిన తంభూర సంగీతాలయంకు చెందిన కళాకారిణి వీణ ప్రదర్శించగా, కూచీపూడి నృత్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.





సాంస్కృతిక కార్యక్రమాలు

